లలిత

"మధుశ్రీ"

రైలుబండి వేగంగా పరుగెడుతున్నది. ఏవిషయం కోసమో-ఎందుకో. ఎండ వాన లెక్కచెయ్యకుండా రాత్రి పగలుకూడా పరుగెట్టి ఒక్కొక్కచోట ఆగి కాస్త విశ్రాంతి తీసుకొనుచున్నది !

ప్లాటుఫారం అంతా గజిబిజిగావుంది. "పూలు... పూలూ" అని వొకడు ... "సోడా .. సోడా" అని మరొకడు "టీ ... టీ" అని ఇంకొకడు ఎవళ్లిష్టమొచ్చినట్లు వాళ్లు గొంతుకలు బ్రద్దలుచేసుకుంటున్నారు ! ఈ కేకలకి ప్రయాణీకుల చెవుల్లో తుప్పదుళ్ళిపోతున్నది.

"అబ్బ ఉక్క ... ఉక్క ... గాలిలేదు, ఎప్పటికీ కదలదేమిటి వెధవబండి" అని వొకడు నిట్టూర్చేడు ! "అక్కడేదో క్రాసింగ్ వుందట ఇంకా అరగంటక్కాని కదలదట" అని ప్రక్కనున్న వొక పెద్ద మనిషితో ఏకరు పెట్టేడు మరొకడు !

ఆ మూడో తరగతి పెట్టెలోనే లలిత భాస్కరరావుగార్లు ప్రయాణిస్తున్నారు. భాస్కరంగారు పినతల్లికి జబ్బుగావుంటే చూడ్డానికి వెళ్లేరు, తిరిగి యింటికి చేరుకుంటున్నారు. లలిత భాస్కరంగారి పదేళ్ల కుమార్తె. ఆమె తండ్రిని వొక్క నిముషం వదిలి వుండదు. ఆయనెక్కడికివెడితే అక్కడికి కూడా వెడుతూంటుంది. ఆమెది చాలా అందమయిన విగ్రహం ! భాస్కరరావుగార్కి లేక లేక కలిగిన కూతురు కావడంవల్లానూ, ఆమెలోని సుగుణాలవల్లానూ ఆయనకు మంచి అభిప్రాయం నాటుకుంది. ఆమె ఏదడిగితే అది ఆయన తీర్చేవాడు. ఆమెకు చిన్నతనంనుంచీ బీదలంటే జాలీ దయాను. ఆ వయస్సులో ఆమె కిలాంటి ఉద్దేశ్యాలు ఉండడాన్ని ఆయన చాలాసార్లు సంతోషంతో వుప్పొంగిపోయేవారు !

ట్రెయిను కదలుతున్నది. ఆ 'మూవ్మెంటు'లోనే ఒక పధ్నాలుగేళ్ల కుఱ్ఱాడు పెట్టెలోకి ఎక్కేడు ... గుండ్రటి కళ్లు ... దుమ్ముకొట్టుకుపోయి - ఎప్పుడూ తైలసంస్కారంలేక రాగి రంగుతో జుట్టు జడలు వేసుకుపోయింది ... ఎముకల బొమ్మలావున్నాడు. చింకిబూట్లూ ... మట్టికొట్టుకుపోయి ... నామమాత్రంగా నిల్చిన గుడ్డలూ చూస్తే ప్రపంచంలోవున్న దరిద్రమంతా అతన్నే వరించినట్లున్నది !

"బాబూ వొక్క కానీ ధర్మం చెయ్యండి ... మీ పాదాలకు దణ్ణం !" వాడి మాట ఎవరూ పట్టించుకున్నట్లు కనబడ్డంలేదు.

"ఫో ... ఫో ... దుక్కలావుండి కూలిపని చేసుకోలేవూ ? ముష్టట ... ముష్టి ! ... ఇందుకనే మనదేశం యిలా దరిద్రంతో ఏడుస్తున్నది" అంటూ వుపన్యసించేడు వొక పెద్ద మనిషి ప్రక్కనున్న ప్రయాణీకునికేసిచూస్తూ.

ముష్టాడు దీనంగా ఆయన ముఖంలోకిచూసి అక్కడనుండి నెమ్మదిగా వెళ్ళేడు ... లలిత తండ్రి ప్రక్కనవుండి ఇవన్నీ వింటున్నది. ఆమె మనస్సెందుకో బాధపడింది. లేతహృదయం పరుగులెట్టింది.

"నాన్నా –"

"ఏమమ్మా –"

"మనం వాణ్ణి తీసుకువెళ్ళి మన యింట్లో అట్టేపెట్టుకుంటే" అని లలిత తండ్రి నడిగింది.

తండ్రి ఆమె గుణ సౌశీల్యానికి ఆనంద బాష్పాలు రాల్చేడు.

"ఏం తీసుకువెడదామా ?"

"ఔను నాన్నా ..."

"ఒరేయ్ ఇలారా" ముష్టివాడి ముఖంగా తిరిగి పిలిచేడు భాస్కరంగారు.

వాడు నీరసంగా అడుగులిడుతూ వచ్చినిలబడ్డాడు.

"నువ్వేంచేయగలవు" అని ఆయన ప్రశ్నించేడు.

"ఏదేనా చిన్న పనులు చేయగలనండి."

"అయితే మాతో వచ్చేస్తావా ?"

"వస్తానండి" వాడి మనస్సెందుకో వేయిమైళ్ల వేగంతో పరుగులెత్తింది !

"అన్నట్టు నీపేరేమిటి ?"

"రాముడండి"

"కాఫీ త్రాగుతాడేమో అడుగు నాన్నా"

భాస్కరంగారు ఫ్లాస్కులోని కాఫీనితీసి వాడికిచ్చేరు. రాముడు త్రాగి కాస్త తేరుకున్నాడు.

"నీ కెవరైనా వున్నారా ?"

"లేరండి —"

"పాపం" నిట్టూర్చింది లలిత. ఆమె ఎందుకో బాధపడింది !

◆ ◆ ◆

భాస్కరంగారూ, లలితా రాముణ్ణి తీసుకొని యిల్లుజేరేరు. రాము డెప్పుడూ అల్లాంటి భవనాన్ని చూడలేదు. తను యిల్లాంటి యింట్లో పడ్డానుకదా అని వుప్పొంగిపోయేడు.

"వీడెవరూ" అని దీర్ఘంతీస్తూ ప్రశ్నించింది భాస్కరంగారిని ఆయన భార్య మాణిక్యమ్మ. ఆమె చాలా కటువయిన మనిషి. డబ్బు ఖర్చంటే ఆమె కసలు కిట్టదు, ఆమెదంతా వింత తత్వం !

"రాముడని వొకడు...వీడు మనింట్లో పనిచేయటానికని తీసుకువచ్చేను."

"చాలా మంచివాడే అమ్మా" అని లలిత అందుకుంది.

"ఊఁ ..." విసుగ్గా మూలిగింది.

◆ ◆ ◆

రాముడికి వాళ్ల దొడ్డి యింట్లో వొకగది యిచ్చేరు. ఒక చిన్న మంచం - నాలుగు జతల గుడ్డలు - మంచిజోళ్లూ ఇచ్చేరు. ఇప్పుడు రాముడు మెతిసిపోతున్నాడు. సుఖంగా కాలం వెళ్లబుచ్చుతున్నాడు.

రాముడికి చదువుమీద శ్రద్ధకలిగింది ... లలిత వొక పలక, పుల్ల కొనియిచ్చింది. అతనికి బళ్లన్నీ చెప్పింది. లలితకి బాగా చనువు కుదిరింది ... అస్తమానం అతని దగ్గరే కూర్చుంటుంది ... అతను వుత్సాహంగా నేర్చుకుంటున్నాడు...లలితని ఎత్తుకు త్రిప్పడమే అతనిపని ... అతని వొళ్లోకి వెళ్ళి కూర్చుంది !

"రాముడూ ... నీకు అమ్మా నాన్నా లేరూ ?"

"లేరమ్మా"

"అయ్యో పాపం మరెలాగ ?" అమాయిక హృదయం తల్లడిల్లింది ... పాపం అందరికీ తల్లీ తండ్రీ వుంటారనుకుంది ... లోకం పోకడ లామెకేం తెలుసును ?

"అదేమమ్మా అలాగంటావు" అని ఎత్తుకొని ముద్దాడేడు.

"తోట్లోకి తీసుకువెళ్లు రాముడూ"

"అలాగేనమ్మా" అంటూ తోట్లోకి తీసుకువెళ్లేడు.

బత్తాయిలూ, నారింజలూ మొదలయిన ఫలజాతులు, రోజా, మల్లి, జాజి, నైట్‌క్వీన్, విరజాజి మొదలయిన పూల జాతులతో ఆ తోట 'ఘుమ ఘుమ'లాడిపోతున్నది. అక్కడే నేలబారు నుయ్యి వొకటికూడావుంది... ఆ నీరు తోడి మొక్కలకుపోస్తారు.

"నాకో కాయ కోసియ్యి రాముడూ" అని లలిత అడిగింది, అడగ్గానే తడవుగా అతను చెట్టు నెక్కేడు ... లలిత వెళ్లి నూతిలోకి తొంగి చూసింది బాల్య చాపల్యంచేత. ఆమెకు కాలు జారింది ... ఆ నూతిలోకి దొర్లిపోయింది. 'గాముడూ' అని పెద్దగా కేకపెట్టింది ... రాముడదిచూసి ఒక్కసారిగా చెట్టు

మీదినుంచి వురికేసి నూతిలోకి అమాంతంగా వురికి లలితని చేతుల్లోకి తీసుకున్నాడు.

లలిత వొణికిపోతున్నది ... భుజాన్న వైచుకొని వూరడించేడు. అతని కళ్ళు నీళ్ళతో నిండేయి ... కొంతసేపటికి లలిత తేరుకుంది. అప్పటినుంచీ రాముడంటే లలితకి అభిమానం మరీ ఎక్కువయింది. ఈ విషయం లలిత వెళ్ళి తండ్రితో చెప్పింది. భాస్కరరావుగారు లలితని గుండెలకు హత్తుకున్నాడు ... రాముడి ధైర్యానికి మెచ్చుకొని అప్పటినుంచీ వాడికి కొంత జీతాన్నికూడా ఏర్పాటుచేశారు. రాముడి మీద ఇప్పుడా యింట్లో గౌరవం పెరిగింది.

◆ ◆ ◆

రోజులు వడివడిగా దొర్లుతున్నవి. లలితకేదో జబ్బు బయలుదేరింది వంట్లో! లలిత చిక్కిపోవుచున్నది. "అమ్మాయికేదేనా మందిప్పించవయ్యగారూ... ఈ మధ్య బొత్తిగా చిక్కిపోవుచున్నారు" అని వంటలక్క చెప్పింది ... "ఆఁ ... అదేంకాదు పిల్ల యిప్పుడు బాగా పొడుగెదుగుతున్నది. జబ్బు కాదు ఏమీ కాదు" అని అన్నాడన్నమాటేకాని లోపల తనకు తెలియకుండా బాధపడుతున్నది "అమ్మాయి చిక్కిపోవుచున్నదేమో" అని.

తల్లి మాణిక్యమ్మకెప్పుడూ ఏదో వొక జబ్బు! ఉన్నా లేకపోయినా జబ్బు కల్పించుకొని (Imaginary sickness) పడుకోవడం వొక అలవాటు!

"అయ్యో నా అశక్తత! పిల్లకేమీ చూడలేకపోతున్నానే" అని బాధపడేది. లలితకన్నీ తండ్రే చూస్తున్నాడు.

లలితకి చిన్నతనాన్నుంచీ ఆధ్యాత్మిక చింత ఎక్కువ! దేముడంటుంది ... పూజలంటుంది ... 'పాపంచేస్తే నరకం అనుభవిస్తారు' అంటుంది, ఇవన్నీ చూసి తండ్రి సంతోషిస్తూవుండేవాడు తన కూతురు పతివ్రత అవుతుందని.

నాగస్వరానికి నాగుపాములాగ, ప్రకృతి సౌందర్యానికి ముగ్ధత్వం చెందుతూంటుంది ... అది సాయంకాలం ... సూర్యాస్తమయ సమయం అయింది.

"రాముడూ—" అని లలిత పిలిచింది.

"ఏమమ్మా—"

"నన్ను మన చెరువుగట్టుమీదికి తీసుకువెళ్ళు" అని నీరసంగా చెప్పింది. లలితని ఎత్తుకొని రాముడు చెరువుగట్టుమీదకి తీసుకెళ్ళేడు. "ఇక్కడ కూర్చుందాం ... దింపు ..." అంటూ అతనినుంచి దిగింది.

అస్తమయ సూర్య కిరణాలు చెరువుమీద ఎఱ్ఱగా అందంగా కనుపిస్తున్నాయి.

"రాముడూ - అలా చూడు ... బంగారురంగు సూర్య కిరణాలు ఎలా పడుతున్నాయో నీటిమీద! అది సరిగ్గా స్వర్గధామంలావుందికదూ! నేనక్కడికి త్వరలో వెడుతున్నాను రాముడూ!!"

"ఎక్కడికి లలితమ్మా?"

లలిత లేచి నిలుచుంది, ఆమె చెక్కిళ్ళు ఎరుపెక్కినవి ... ఆమె కళ్ళు మెరుస్తున్నవి. "అక్కడికే స్వర్గానికి!! ... త్వరలో వెడుతున్నాను."

రాముని హృదయం బరువెక్కింది. వాడు ఆరు నెలల క్రితంనుంచీ కనిపెడుతూనేవున్నాడు. లలిత రోజు రోజుకీ నీరసపడుతూందన్న సంగతి. లలిత ఎంత గబగబా లేడిలా పరుగెత్తేది! ఇప్పుడు నడవటమే కష్టంగావుంది! అప్పుడు తనతో రోజల్లా ఆడుకునేది. ఇప్పుడు అసలు ఆటలమీదకి దృష్టేపోవటంలేదు! ఇలా ఆలోచించుకుంటూ కన్నీరు కార్చేడు.

"ఎందుకేడుస్తావు రాముడూ?"

"అబ్బే ఏమీలేదు" అని కళ్లు వొత్తుకున్నాడు.

"అమ్మా లలితా" అని వంటలక్క గట్టిగా కేక పెట్టింది. "నువ్వు త్వరగా లోపలికొచ్చెయ్యి ...

నీవొంట్లో బాగాలేదనుకూడాను.” ఆమె ఎన్నో సార్లు చెప్పింది "మంచి మందేదైనా అమ్మాయి కిప్పించండి” అని. ఆమెకు తెలుసును లలిత నీరస పడుతూందని ... లలితంటే ఇంట్లో అందరికీ ఎంత ప్రేమను! అందగూ లలితని నెత్తిమీద పెట్టుకు చూస్తారు. వాళ్ళనామె గారవిస్తుంది.

తల్లి మాణిక్యమ్మ ఆ గొడవే పట్టించుకోదు, తన గొడవే తనది.

"చాలా భయంకరమైన వ్యాధికి లలిత గురౌతున్నది” అని లోపల బాధపడి వుంటుంది!

"ఆమె బాగా ఎదుగుతున్నందువల్ల నీరసపడుతున్నద”ని సమాధానపరుచుకుంటున్నాడు భాస్కరం గారు.

♦ ♦ ♦

కాని కొన్నాళ్ళకు లలితకి జబ్బెక్కువయింది. తండ్రి కంగారుపడి డాక్టరుని పిలిచేడు. మాణిక్యమ్మ గారు లలితగొడవేమీ పట్టించుకోనట్లుగావుంది. తనకేదో జబ్బుందని బాధపడుతుంది. కన్నకడుపు కనుక అప్పుడప్పుడు విచారిస్తూ వుంటుంది. లలితకి మళ్లీ కొన్నాళ్లు తగ్గింది ... మళ్లీ జబ్బు చేస్తున్నది.

"రాముడూ! మనం అప్పేళ రైల్లో ప్రయాణించేటప్పుడు నేనెంతమంది అనాథల్ని చూసేను పాపం! అప్పుడేకాదు ... ఇంకా చాలాసార్లు చూసేను ... నా మనస్సెంత బాధపడింది! వాళ్ళందర్నీ రక్షించగలిగితే నేను సుఖంగా, సంతోషంగా మరణిస్తాను.”

ఈ మాట లంటూండగానే తండ్రి భాస్కరం గారు అక్కడికి వచ్చేరు. లలిత ఆయన ముఖం లోకిచూసి మోకాళ్ళమీద కూర్చుంటూ ఇలా చెప్పింది.

"నాన్నా - నేనీ విషయం ఇంకా నీ దగ్గర దాచి పెట్టడం నా కిష్టంలేదు. నేను నీతో ఇంక ఎన్నాళ్లో వుండలేను. నేను శాశ్వతంగా వెళ్ళి పోతున్నాను. మళ్లీరాను.”

"లేదమ్మా అదెప్పటికీ సాధ్యంకాదు భయపడకు... అలా ఎప్పుడూ మాట్లాడకు...”

"ఇది నిజంనాన్నా ... నాకు తెలుసును... నాకు ఎప్పుడూ బాగా వుండటంలేదు... నాకు స్వర్గానికి వెళ్లాలనివుంది...నిన్నూ... మనవాళ్లందర్నీ వదలి వుండలేనేమో! కాని నేను చూడలేనన్ని దుఃఖ భాజనమయిన విషయాలీ ప్రపంచంలో వున్నాయి.”

"నీకంత విచారం రావడానికేమి కారణం”

"ఇంతమంది జనం పిన్నా పెద్దా ముసలీ తిండిలేక దరిద్రంతో మాడిపోతూవుంటే నేనెలాచూడగలను? మనలాంటి వాళ్లుకాదా వాళ్లూను...ఎంతమంది ఇళ్లు లేక చెట్లనీడని వానకి తడిసి ఎండకు ఎండి - వొక పూట తిండివుంటే వొకపూట లేక ఎల్లా మాడిపోతున్నారో చూశావా? ... నేను సహించలేను.

"మన పనివాళ్లు సుఖంగాలేరా!”

"ఔను మనపనివాళ్లు సుఖంగానే వున్నారు. కాదనను. అందరూ నీలాగేచూస్తారా? నీవు నేను కులాసాగా వుండటమేకావాలి; - అది స్వార్థం కాదా? ... పాపంవాళ్లని చూసేవారెవరూ? ... నాన్నా వాళ్ళందరికీ ఎప్పటికైనా సుఖం వస్తుందా?”

"అది దుస్సాధ్యం లలితా ... నా మటుక్కి నేను చేయగలను. అందరి చేతా ఎవడు చేయించ గలడు?”

"నాన్నా నేను చచ్చిపోతాననుకో ... నువ్వు వీళ్ళందర్నీ సుఖపెడతావా? మామూలుగా చూస్తావా?”

"నువ్వు చచ్చిపోవడమా? అదేం మాటలమ్మా అలాగంటావు? అలా ఎప్పుడూ మాట్లాడకు... నాకు నువ్వేపరమావధివి ... నిను చూచుకునే నేను జీవిస్తున్నాను. నీకంటె కావలసిందేముంది నాకీ

"ప్రపంచంలో ?" గద్గదస్వరంతో గబగబ అన్నారు భాస్కరంగారు. ఆయనకు భయం ఎక్కువయింది.

"నాన్నా వీళ్లున్నారే ఈ కూలివాళ్లూ, ముష్టి వాళ్లూను - నువ్వు నన్నెంతగా ప్రేమిస్తున్నావో- వాళ్లుకూడా వాళ్ళ పిల్లల్ని అంతగానూ ప్రేమిస్తున్నారు. ప్రేమకి కలిమిలేములతో నిమిత్తంలేదు నాన్నా ..కాకి పిల్ల కాకికిముద్దు ! నాతో వొక్కసారి చెప్పు వీళ్ళందర్నీ నా అనంతరం బాగా చూస్తానని" లలిత ప్రాధేయపూర్వకంగా అడిగింది.

"అలాగే నమ్మా తప్పకుండా... ఈ ప్రపంచంలో నీకు కావలసినదేదైనా చేస్తానమ్మా" భాస్కరం గారి కళ్లు నీళ్లు తిరిగేయి.

"మనిద్దరంకలసి అక్కడకు ఎలా వెడతాం? అక్కడ చాలా ప్రశాంతంగా వుంటుంది" అని ఆమె తండ్రి భుజాన్ని బుగ్గ ఆన్చి పడుకుంది. వొళ్లు సలసల కాగుతుంది.

♦ ♦ ♦

కాలం గడుస్తున్నకొద్దీ లలిత చాలా నీరసపడ జొచ్చింది. ఆమె కసలు బలంలేదు. ఆమెపడుకుని అందమైన వుద్యానంలోని మొక్కల్నీ, చెరువునూచూచి స్వర్గాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటున్నది. ఇంతట్లోకీ తల్లి రాముణ్ణి వేసే కేక గట్టిగా వినిపించిందామెకు.

"ఒరేయ్ రాముడూ ఏమిట్రా నువ్వు చేసేపని ఎందుకురా పువ్వులేరుతావ్ ?" ఆమె గట్టిగా కేక పెట్టింది.

"లలితమ్మకోసం పువ్వులేరుతున్నా నండమ్మ గారూ"

"అబ్బ ఎంత బాగున్నాయ్ పువ్వులూ ! నువ్వు నాకు రోజూ పువ్వులు తెచ్చి పెడతావా ?" లలిత అడిగింది.

"తప్పకుండానమ్మా" అంటూ గదిలోంచి వెళ్లి పోయేడు "పాపం అభాగ్యుడు నాకేదో వొకటి చెయ్యాలనుకుంటూ వుంటాడు" అనుకుంది.

ఆ సాయంకాలం వంటలక్కని పిలిచింది లలిత "మనయింట్లోవున్న పనివాళ్ళందర్నీ ఇక్కడకి పిలు" అంది. వంటలక్క పిలువగా అందరూ అక్కడికి వచ్చేరు. "అబ్బ ఎంత నీరసపడిపోయింది!" అని వాళ్లందరూ ఆశ్చర్యపడ్డారు. వీళ్ళందర్నీ చూసి తలగడలోంచి మొహంపైకెత్తి "నేను మీకోసం పంపేను. మీరంతనాకు స్నేహితులు- నేను మిమ్మల్నందర్నీ ప్రేమిస్తున్నాను కాబట్టి! కాని నేను వెళ్ళిపోతున్నాను. ఎక్కడికీ ... గాంధీతాతావాళ్లూ ఎక్కడికి వెళ్లేరో ఆ అందమైన మరోప్రపంచంలోనికి ... మీరంతా భగవంతుణ్ణి రోజూ ప్రార్థించండి...మిమ్మల్నికూడా దేముడక్కడికే తీసుకువస్తాడు ! ఇంక మాట్లాడలేక పడుకుంది. అందరూ దీర్ఘనిశ్వాసం విడిచేరు. వాళ్ళంతా భయపడిపోతున్నారు. ఆమె వాళ్ళకేసి చూసి మళ్ళీ యిలాగన్నది.

"మీరు భయపడకండి. మీ అందరి మంచికోసం నేను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. దేముడు తప్పకుండా మీకు మేలు చేస్తాడు. మీరుకూడా దేముణ్ణి ప్రార్థిస్తూవుండండి." అంది చిరునవ్వు తెచ్చుకుంటూ. "నిన్ను భగవంతుడు రక్షించుగాక!" అని వాళ్లు దీవించేరు.

"మీరంతా నన్ను ప్రేమతో చూసేరు. నేను మిమ్మలందర్నీ ప్రేమించేను. మీ అందరికీ తలొకటీ యివ్వదల్చుకున్నాను." అంటూ అందరికీ తలొక పంచలచాపూ చీరా యిచ్చింది. "మీరొక విషయం జ్ఞాపకం వుంచుకోండి. నాయీ చిన్న బహుమతుల్ని చూసి నేను మిమ్మల్ని ప్రేమతో చూచేదాన్నని" అని నన్ను మర్చిపోకండి.

అక్కడున్న అందరూ మాట్లాడలేక పోయేరు. దుఃఖం పెల్లుబికివచ్చింది. కన్నీరు కార్చేరు. మాట్లాడేదిలేక ఆమె యిచ్చే బహుమతుల్ని అందుకున్నారు. ఆఖరికి అందరూ అవతలికి వెళ్ళేరుకాని రాము దక్కడే వున్నాడు.

"రాముడూ! యిదిగో నీకోసం ప్రత్యేకంగా అట్టే పెట్టేను. ఇదిగో ఈ వుంగరం తీసుకో... నాకు తెలుసును నిన్ను నేను మళ్ళీ స్వర్గంలో కలుసుకోగలను. అబ్బ ఎంత హాయిగావుంది స్వర్గాన్ని తల్చుకుంటుంటే!"

లలితకి జబ్బు బాగా ఎక్కువయింది. వంటలక్క రాత్రింబవళ్లూ మెనే కాచిపెట్టుక్కూర్చుంటున్నది ఆమెకి పరిచర్యలు చేస్తూ. మాణిక్యమ్మ తన జబ్బు గొడవేదో తను చూసుకొను చున్నది. తండ్రికి పూర్తిగా మతిపోయినట్లుగావుంది. తిండి నిద్రమాని కుర్చీలో కళ్లు మూసుక్కూర్చున్నాడు లలితని చూడలేక!

'రాముడూ నన్ను వుద్యానంలోకి తీసుకెళ్ళవూ?'

ఆమెనెత్తుకుని తీసుకువెళ్లేడు.

"ఇదిగో ఇదివరకు పాడేవుకదూ బృందావనం పాట. అది వొక్కసారి పాడవూ? ఇంకొక్కసారి వినాలనున్నది.!"

అమెకది ప్రీతికరమైన పాట. రాముడుపాడేడు. లలిత తన్మయంలో మునిగింది.

అదే ఆమె ఆఖరిసారి విన్నది!

♦ ♦ ♦

ఒకనాడు రాముడు వసారాలో నేలమీద పడుకుని వుండటం వంటలక్క చూసింది.

"రాముడూ – నువ్విక్కడ పడుకున్నావేం?"

"లలితమ్మ ఎప్పుడేనా పిలుస్తుందేమోనని"

ఆరోజంతా లలిత చాల కులాసాగావున్నది.

అందరి ముఖాల్లోను ఆశాజ్యోతి మెరిసింది! కాని అర్ధరాత్రయ్యేటప్పటికంతా మారిపోయింది. వంటలక్క రాముణ్ణి పిలిచి డాక్టరుని తీసుకు రమ్మన్నది.

"భాస్కరంగారూ! అమ్మాయికి ఎక్కువగా ఉంది!" వంటలక్క పిలిచింది.

డాక్టరుగారు వచ్చేరు కాని ఆయన చెయ్యి దగ్గదేమో లేకపోయింది! లలిత కళ్లు మూసుకునుంది. శ్వాసమాత్రం ఆడుతున్నది. భాస్కరంగా రామె మీదకువంగి "అమ్మాయ్ లలితా-" అని పిలిచేరు. ఆమె తన చక్రాల్లాంటి పెద్దకళ్ళను విప్పి తండ్రికేసి చూసి నవ్వింది! ఆమె వూపిరిపీల్చడానికి బాధపడుతున్నది. తండ్రి చూడలేక అటు తిరిగి రామంచెయ్యి పట్టుకున్నాడు.

"అలా చూడండయ్యగారూ!" రాముడన్నాడు.

"లలిత వెల్లకిలాపడుకునుంది. ఆమె చిన్నారి మోములో ఆశ్చర్యంకనబడింది....ఆమె స్వర్గం చూస్తున్నట్లుగా ప్రశాంతంగా నవ్వింది! ఆ నవ్వే నిల్చిపోయింది!

అన్ని నొప్పులకు
అమృతాంజనము